www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

బుధవారం
04.11.2026



ముమ్మిడిపోట్టి వేగం పెంచాలి

- మహారాష్ట్ర తో నిరంతరం సంప్రదింపులు జరపాలి
- ముంపు భూములకు పూర్తి పరిహారమిస్తాం
- జాయింట్ ఖాతాలో నిధులుంచుతాం
- అన్ని వివరాలతో సిద్ధంగా ఉండండి
- బ్యారేజీపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

4 లో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సాగు, తాగునీటి గోస తీర్చే తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణ కసరత్తును పరుగులు పెట్టించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ప్రాజెక్టు పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్రతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రాజెక్టు నిర్మాణంతో సరిహద్దు ప్రాంతాల్లో ముంపునకు గురయ్యే భూములకు నిబంధనల మేరకు పూర్తి పరిహారం చెల్లిస్తామని, ఇందుకోసం జాయింట్ అకౌంట్ ఏర్పాటు చేసి నిధులు జమ చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ముంపు నిర్ధారణకు పొరుగు రాష్ట్రం స్వతంత్ర సర్వే చేసుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, పక్కా పారదర్శకతతో ఉత్తర తెలంగాణ రైతాంగానికి మేలు చేసే ఈ ప్రాజెక్టును త్వరితగతిన పట్టాలెక్కించాలని తేల్చిచెప్పారు. కలంజ్యోతి, హైదరాబాద్






దేశ సంక్షేమం కోసమే ఓట్ల సవరణ

- దేశ ప్రయోజనాల కోసమే ఓటర్ల జాబితా మార్పులు
- మోదీ ప్రతిష్టను ఎవరూ దెబ్బతీయలేరు
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఇంఛార్జి సునీల్ బన్సల్
- రేవంత్ రెడ్డి ముఠా మేస్త్రి కాదు, మూటల మేస్త్రి
- ఓటు చోరీ నినాదంతో ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నారు
- వాస్తవాలు వక్రీకరిస్తున్న కాంగ్రెస్‌కు కాలం చెల్లింది
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- నిర్మల్‌లో కాషాయ దళం భారీ పాదయాత్ర

2 లో..

దేశ సమగ్రతను కాపాడేందుకే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపడుతుంటే, కాంగ్రెస్‌తో పాటు కొన్ని పార్టీలు బోగస్ ఓట్ల రాజకీయాల కోసం విషం చిమ్ముతున్నాయని బీజేపీ అగ్రనేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా ఆదివారం నిర్మల్ పట్టణంలో బీజేపీ శ్రేణులు కదం తొక్కి మహా పాదయాత్ర నిర్వహించాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ పరిపాలనపై కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టి మూటలు మోసే మేస్త్రిగా మారారని, ఓటు చోరీ పేరిట ప్రజలను తప్పదోవ పట్టించే కుట్రలు సాగబోవని నేతలు తేల్చిచెప్పారు.

- కలంజ్యోతి, నిర్మల్



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
బుధవారం 04.11.2026
www.kalamjyothi.com

దేశ సంక్షేమం కోసమే ఓట్ల సవరణ

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 03) : భారతదేశ భద్రత, సమగ్రత పరిరక్షణ లక్ష్యంగా ఓటర్ల సవరణ చేపడితే దేశద్రోహ శక్తుల ఓట్లతో రాజకీయాలు నడిపే పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఇంఛార్జి సునీల్ బన్సల్ మండిపడ్డారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి చేపట్టిన సర్ కార్యక్రమానికి మద్దతుగా నిర్మల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర ఘనంగా నిర్వహించారు. దాదాపు మూడు కిలోమీటర్ల మేర సాగిన ఈ యాత్రతో నిర్మల్ పట్టణ ప్రధాన రహదారులన్నీ కాషాయ జెండాలతో రెపరెపలాడాయి.



మోదీ ప్రతిష్టను ఎవరూ దెబ్బతీయలేరు..

పాదయాత్ర అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సునీల్ బన్సల్ ప్రసంగిస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం అత్యంత సురక్షితంగా ఉందని, ప్రజలు కనబరుస్తున్న అపూర్వ ఆదరణే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలోని సుపరిపాలన అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో దేశాల ప్రభుత్వాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. స్వార్థ ప్రయోజనాలు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కొన్ని రాజకీయ శక్తులు కాక్రోచ్ పార్టీలకు కొమ్ముకాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా మోదీ విశ్వసనీయతను, ప్రతిష్టను ఏమాత్రం దెబ్బతీయలేరని స్పష్టం చేశారు.

రేవంత్ రెడ్డి ముఠా మేస్త్రి కాదు, మూటల మేస్త్రి..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పాలకుల వద్ద తాకట్టు పెట్టి కుర్చీ కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజల బాగోగులు, సంక్షేమాన్ని గాలికి వదిలేసిన ఆయన ముఠా మేస్త్రి కాదని, ఢిల్లీ అధిష్టానానికి మూటలు మోసే మేస్త్రిగా మారిపోయారని విమర్శించారు. అధికారం చేజిక్కించుకోవడం కోసం ప్రజలను నమ్మించి వంచించినందుకు రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీలను అమలు చేయడంలో విఫలమై, ప్రజలు ఎక్కడ నిలదీస్తారో నన్న భయంతోనే కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం చేస్తోందని ఎద్దేవా చేశారు.

ఓటు చోరీ నినాదంతో ప్రజలను తప్పదోవ..

రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతో కాంగ్రెస్ నాయకులు ఓటు చోరీ అంటూ సరికొత్త నాటకానికి తెరతీసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఏలేటి ఆరోపించారు. ఇతర దేశాల నుంచి అక్రమంగా వలసలు వచ్చిన వారిని, చనిపోయిన వారిని, రెండు ప్రాంతాల్లో ఒకేసారి ఓటు హక్కు కలిగి ఉన్న బోగస్ పేర్లను జాబితా నుంచి తొలగించడం ఏ విధంగా నేరమవుతుందని నిలదీశారు. వాస్తవాలను వక్రీకరిస్తూ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీలు నగేష్, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాయల్ శంకర్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్‌లతో పాటు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన బీజేపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రతిభను వెలికితీసేందుకే

యువజనోత్సవాలు


అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 03) : యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలను వెలికితీసి వారిని ప్రోత్సహించేందుకే జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్ అన్నారు. స్థానిక జెవిఎన్ఆర్.ఉన్నత పాఠశాలలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటాలన్నారు. స్వామి వివేకానందుని ఆశయాలు, సందేశాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని, ఆయన బోధనలను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఆయా విభాగాల్లో ప్రథమ బహుమతి సాధించిన విజేతలు రాష్ట్రస్థాయి నిర్వహించే పోటీల్లో జిల్లా పక్షాన పాల్గొననున్నారు. జిల్లా యువజన సేవల శాఖ అధికారి బి. శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ వినోద్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, న్యాయ నిర్ణేతలు జోసఫ్ బాబురావు, ఎట్టెం రజిత, సౌమ్య, మధు, మెట్టు రవి, కొండూరు పోతన్న, విశ్వనాథ్ వర్మ, చెనిగారపు నాగరాజు, వేణుగోపాల్, ఎర్రన్న, రఫిక్, పేట కార్యదర్శి భూమన్న, రవీందర్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధరే లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

కలంజ్యోతి, ఇల్లంతకుంట (నవంబర్ 03) : రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజకు కనీస మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. మంగళవారం ఇల్లంతకుంట మండలం వెల్జీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు.



దళారులను నమ్మి మోసపోవద్దు..

రైతులు మధ్యవర్తులను, దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఉట్కూరు వెంకటరమణారెడ్డి, సర్పంచ్ నాయిని నవీన్ కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ గుండా వెంకటేశం, ఏపీఎం కుమారస్వామి, రామచంద్రరెడ్డి, వార్డు సభ్యులు బొజ్జ శ్రీనివాస్, సంగెం ముత్తవ్వ, వెలిచాల భారతి శ్రీనివాస్, వేములవాడ భారతి రాజేశం, పాలకేంద్రం చైర్మన్ మూల బాల్ రెడ్డి, వీహో అధ్యక్షురాలు ఓరెమ్ రూప, భార్గవ్ రెడ్డి, సీఏ కంకణాల కరుణ శ్రీనివాస్ రెడ్డి, హమాలీ సంఘం అధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు బొల్లారం పరశురాములు, వేములవాడ రమణాచారి, గుండ శ్రీనివాస్, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

అసభ్యంగా ప్రవర్తిస్తే రౌడీషీట్ తెరుస్తాం

సిరిసిల్ల డీఎస్పీ కె. నాగేంద్ర చారి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (నవంబర్ 03) : మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని సిరిసిల్ల డీఎస్పీ కె. నాగేంద్ర చారి హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన సయ్యద్ జుబేర్ నిరంతరం మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తుండటంతో అతని నేర ప్రవృత్తిని పరిగణనలోకి తీసుకొని రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై, మహిళలను వేధించే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా ఏమాత్రం భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల భద్రతకు, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ నిరంతరం అంకితభావంతో కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.







బ్రీడింగ్ చెకర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

ముత్యం రాజు, జన్ను సరిత ఏకగ్రీవం

కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 03) : వరంగల్ జిల్లా బ్రీడింగ్ చెకర్స్ కార్మిక యూనియన్ ప్రధాన కార్యదర్శులుగా చెన్నారావుపేట మండలానికి చెందిన ముత్యం రాజు, జన్ను సరిత ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు భూక్య శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ముత్యం రాజు, జన్ను సరిత మాట్లాడుతూ, తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన యూనియన్ అధ్యక్షుడు భూక్య శ్రీనివాస్‌కు, జిల్లాలోని బ్రీడింగ్ చెకర్స్ కార్మికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో కార్మికుల సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాటోతు శేఖర్, భద్రయ్య, రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

బుధవారం 04.11.2026

www.kalamjyothi.com



రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఉషోదయ విద్యార్థులు

విద్యార్థినులకుడైరెక్టర్ రాహుల్ వర్మ అభినందనలు

కలంజ్యోతి, గీసుగొండ (నవంబర్ 03) : సంగారెడ్డి జిల్లా వోక్సెన్ యూనివర్సిటీలో ఈ నెల 4, 5 తేదీల్లో తెలంగాణ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అస్మిత రగ్బీ పోటీలకు గీసుగొండ మండలం గంగాదేవిపల్లి ఉషోదయ హైస్కూల్ విద్యార్థినులు దుద్దు తేజస్వి, సింగిరెడ్డి హన్సిక, వేల్పుల సాత్విక, బానోతు జ్యోతి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను పాఠశాల డైరెక్టర్ గిరిగాని రాహుల్ వర్మ ప్రత్యేకంగా అభినందించారు. ఖేలో ఇండియాలో భాగంగా బాలికలను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నారని, విద్యార్థినులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని ఆయన ఆకాంక్షించారు. తమ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రగిరి మహేష్, వైస్ ప్రిన్సిపాల్ వీరన్న, వ్యాయామ ఉపాధ్యాయుడు కుంట విజేందర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మిర్చి పంట ధ్వంసం

రైతుకు రూ.10 లక్షల నష్టం



కలంజ్యోతి, దుగ్గొండి (నవంబర్ 03) : దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు మిర్చి పంటను ధ్వంసం చేయడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. గ్రామానికి చెందిన రైతు హింగే మణి సాగు చేసిన సుమారు ఎకరం 15 గుంటల మిర్చి పంటను గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే పీకి పక్కకు పడేశారు. పంట చేతికొచ్చే దశలో ఈ దారుణం జరగడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న తనను ప్రభుత్వం, అధికారులు ఆదుకొని తగిన పరిహారం అందించాలని, పంటను ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

అనారోగ్యంతో వృద్ధురాలు ఆత్మహత్య

కలంజ్యోతి, ఇల్లంతకుంట (నవంబర్ 03) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన కళ్యాడపు హనుమవ్వ (85) అనారోగ్యం భరించలేక ఆత్మహత్య చేసుకుంది. గత కొంతకాలంగా ఆస్తమా, వృద్ధాప్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆమె, నవంబర్ 2న తంగళ్లపల్లిలో ఉంటున్న తన కుమార్తె ఆదిలక్ష్మితో ఫోన్‌లో మాట్లాడి తన ఆరోగ్య పరిస్థితిని వివరించింది. అదే రోజు రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకుంది. మరుసటి రోజు ఉదయం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బహుళ పంటలతో ఆదర్శ రైతు

- ఎకరంన్నరలో ఐదు రకాల పంటల సాగు
- నీటి సద్వినియోగంతో అధిక లాభాలు
- ఆదర్శ రైతు గంగాధర్‌కు కలెక్టర్ అభినందనలు



కలంజ్యోతి, రాజన్న సిరిసిల్ల (నవంబర్ 03) : అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఒకే భూమిలో ఐదు రకాల విభిన్న పంటలు సాగు చేస్తూ తోటి కర్షకులకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన రైతు తూము గంగాధర్. రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన గంగాధర్ తనకున్న ఎకరం 20 గుంటల భూమిలో వినూత్న రీతిలో సమగ్ర వ్యవసాయం చేపట్టారు. ఇందులో పసుపు 20 గుంటలు, వెల్లుల్లి 10 గుంటలు, ఉల్లిగడ్డ 10 గుంటలు, మిర్చి 10 గుంటలు, కొత్తిమీర 10 గుంటల విస్తీర్ణంలో సాగు చేస్తూ నీటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. వివిధ రకాల పంటల ద్వారా భూసారాన్ని కాపాడుతూనే నిరంతరాయంగా మంచి ఆదాయం పొందే దిశగా అడుగులు వేస్తున్నారు.

మానాల గ్రామంలో ఐదు రకాల పంటలు సాగు చేస్తున్న రైతు తూము గంగాధర్ వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పసుపు, వెల్లుల్లి, కూరగాయ పంటలను పరిశీలించిన కలెక్టర్ పంట కాలపరిమితి, దిగుబడి, మార్కెటింగ్ వివరాలు, వచ్చే నికర ఆదాయంపై ఆరా తీశారు. పసుపును స్థానిక మార్కెట్‌తో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, నిజామాబాద్ కేంద్రాలకు తరలించి విక్రయిస్తామని, మిగిలిన ఉత్పత్తులను స్థానిక సంతల్లో అమ్ముకుంటామని రైతు వివరించారు. తక్కువ నీటితో బహుళ పంటలు పండిస్తున్న రైతు ప్రతిభను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి సంపత్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అష్టల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ పుష్పలత పాల్గొన్నారు.

కుష్టు గుర్తింపు సర్వే పరిశీలన

ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించాలి లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు

రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ రాజు



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (నవంబర్ 03) : రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలో చేపడుతున్న ఇంటింటి కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే (ఎల్‌సీడీసీ) తీరును రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రతి ఇంటిలోని ప్రతి ఒక్కరినీ తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. చర్మంపై స్పర్శలేని, రాగి రంగు మచ్చలు ఉన్నవారు వెంటనే ప్రభుత్వ కేంద్రాల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచించారు. ప్రారంభ దశలోనే గుర్తిస్తే అంగవైకల్యం నివారించవచ్చని, ప్రజలు అపోహలు వీడి సిబ్బందికి సహకరించాలని కోరారు.

పాడి పశువులకు ఉచిత చికిత్స శిబిరం

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 03) : చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. సర్పంచ్ బుర్ర సుదర్శన్ ఈ శిబిరాన్ని ప్రారంభించగా,



పశువైద్యుడు డాక్టర్ జునైద్ ఖాన్ మాట్లాడుతూ రైతులు గోపాలమిత్ర సేవలు, లింగ నిర్ధారణ వీర్యం సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. శిబిరంలో 64 పాడి పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. 34 పశువులకు ఎద పరీక్షలు, 23 దూడలకు నట్టల మందులు, 24 పశువులకు గర్భ నిర్ధారణ, కృత్రిమ గర్భధారణ చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లింగాల సారంగం, డాక్టర్ బి. వెంకటరాజు, గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఎండి జహంగీర్, జేవీఓ శ్రావణ్, వీఏ వీరులాల్, పంచాయతీ కార్యదర్శి రాజు, గోపాలమిత్రులు అబ్బరపూరి రమేష్, కళ్లెపు ప్రసాద్, బింగి లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
బుధవారం 04.11.2026
www.kalamjyothi.com

తుమ్మిడిహెట్టి వేగం పెంచాలి

కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 03) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సాగు, తాగునీటి అవసరాలు తీర్చే తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణ కసరత్తును మరింత వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌లతో కలిసి ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ప్రాజెక్టు పనులను సమన్వయం చేసుకోవాలని, ఇటీవల పొరుగు రాష్ట్రంతో జరిగిన చర్చల పురోగతి ఆధారంగా తదుపరి అడుగులు వేయాలని స్పష్టం చేశారు.



ముంపు భూములకు పూర్తి పరిహారమిస్తాం..

బ్యారేజ్ నిర్మాణం కారణంగా మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ముంపునకు గురయ్యే భూములకు నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి తేల్చిచెప్పారు. ముంపు ప్రాంతాల నిర్ధారణ కోసం మహారాష్ట్ర ప్రభుత్వం స్వతంత్రంగా ఎలాంటి సర్వే నిర్వహించుకున్నా తమకు ఎటువంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. ప్రాజెక్టు విషయంలో రెండు రాష్ట్రాల మధ్య పూర్తి పారదర్శకతతో ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

జాయింట్ ఖాతాలో నిధులుంచుతాం..

పరిహారం చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం, ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన నిధులను ప్రత్యేకంగా జాయింట్ ఖాతాలో జమ చేయడానికి తెలంగాణ సర్కార్ సిద్ధంగా ఉందని సీఎం ప్రకటించారు. ఈ జాయింట్ ఖాతా ద్వారా నిర్దేశిత గడువులోగా రైతులకు, బాధితులకు నేరుగా పరిహారం అందేలా పక్కా కార్యాచరణ రూపొందించాలని, నిధుల లభ్యత విషయంలో పొరుగు రాష్ట్రానికి పూర్తి భరోసా కల్పించాలని అధికారులను ఆదేశించారు. మహారాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన సమగ్ర సాంకేతిక సమాచారంతో పాటు గతంలో కుదిరిన ఒప్పందాలు, నివేదికల కాపీలను ఎప్పటికప్పుడు అందజేయాలని, ఉత్తర తెలంగాణ రైతాంగానికి మేలు చేసే ఈ ప్రాజెక్టును త్వరితగతిన పట్టాలెక్కించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.



ప్రజాప్రతినిధులపై దాడులు సహించబోం

బాధిత ఉప సర్పంచ్‌కు పూర్తి మద్దతు

ఉప సర్పంచ్ ఫోరం
రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు కార్తీక్

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (నవంబర్ 03) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామ ఉప సర్పంచ్ బొడ్డు రాజుపై జరిగిన కత్తి దాడిని ఉప సర్పంచ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు కార్తీక్ తీవ్రంగా ఖండించారు. దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బొడ్డు రాజును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఫోరం తరపున ఆయనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమిస్తున్న ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని బొడ్డు కార్తీక్ అన్నారు. ప్రజాసేవలో ఉన్న వారికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని స్పష్టం చేశారు. ఉప సర్పంచులు, వార్డు సభ్యులపై ఈగ వాలినా రాష్ట్రవ్యాప్తంగా కందిరీగల్లా కదిలివచ్చి సంఘటితంగా పోరాడుతామని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులపై భౌతిక దాడులకు తెగబడే వారిపై పోలీసులు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కమలాకర్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు మందాటి రాము యాదవ్, జిల్లా కమిటీ సభ్యులు కొల్లి అనిల్, బాల్ రెడ్డి తదితరులు పాల్గొని బొడ్డు రాజుకు సంఘీభావం తెలిపారు.

యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి

కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 03) : ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు నర్సంపేట పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు ముమ్మరంగా నిర్వహించారు. 29వ వార్డులో పట్టణ అధ్యక్షుడు నాగేల్లి వెంకట నారాయణ, 5వ వార్డు సర్వాపురంలో అధ్యక్షుడు సంపంగి సాలయ్య, కౌన్సిలర్ అభ్యర్థి కందికొండ సంధ్య శ్రీను, 8వ వార్డు ద్వారకపేటలో కౌన్సిలర్ అభ్యర్థి పెండెం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ ఎమ్మెల్సీ ఇంచార్జీలు గోనె యువరాజు, రాయిడి దుష్యంత్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల వేళ నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి కాంగ్రెస్ నిరుద్యోగులను మోసగించిందని ఆరోపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సర్వర్ల సమస్యలతో నమోదుకు ఇబ్బందులు ఎదురవుతున్నందున నవంబర్ 6 ముగిసే గడువును పొడిగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువజన నాయకులు బొల్లెపల్లి కమల్, నాగేల్లి అరవింద్, నాగేల్లి శివరాం, సంపంగి వంశీ పాల్గొన్నారు.





ఆరుతడి పంటలకే ప్రాధాన్యం

ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించాలి
మండల స్పెషల్ ఆఫీసర్ రామకృష్ణ

కలంజ్యోతి, ఇల్లంతకుంట (నవంబర్ 03) : యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం వల్ల తలెత్తే సమస్యలను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ రామకృష్ణ సూచించారు. దాచారం రైతు వేదికలో నిర్వహించిన వ్యవసాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, నీటి కొరతను అధిగమించేందుకు వరికి బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రసాయనాల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులను ప్రోత్సహించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, మండల రెవెన్యూ అధికారి సురేష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శశికళ, ఉద్యానవన అధికారి గోపర్ధన్, ఇరిగేషన్ ఏఈ దిలీప్, విద్యుత్ శాఖ అధికారి పులి పర్శరాం, ఇన్‌చార్జి ఏఈవో అభిషేక్, ఆయిల్‌పామ్ క్లస్టర్ అధికారి వినయ్, దాచారం సర్పంచ్ కుడుముల రేణుక, తెనుగువారిపల్లి సర్పంచ్ వంచ చంద్రారెడ్డి, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

డిసెంబర్ 15 నుంచి ఆశా కార్యకర్తల సమ్మె

సమస్యలు పరిష్కరించకుంటే విధుల బహిష్కరణ

బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు

వైద్యాధికారులకు సమ్మె నోటీసుల అందజేత

కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 03) : ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించకుంటే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు హెచ్చరించారు. నర్సంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, బాంజీపేట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లకు సమ్మె నోటీసులు అందజేశారు. నెలకు రూ.18 వేల వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే విధులు బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీపీ యూనిట్ అధ్యక్షురాలు సంధ్య, బాంజీపేట పీహెచ్‌సీ అధ్యక్షురాలు సునీత, నాయకులు లలిత, రమ, సరోజన, లత, విజయ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ పోస్టుల ఇంటర్వ్యూలు

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర, వెంకటాపూర్ గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధ, గురువారాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి (డీడబ్ల్యూవో) లక్ష్మీరాజం తెలిపారు. పదిర గ్రామంలోని ఒక పోస్టుకు బుధవారం, వెంకటాపూర్‌లోని రెండు పోస్టులకు గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించారు. సంబంధిత అభ్యర్థులు నిర్ణీత సమయానికి కలెక్టరేట్‌కు చేరుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని డీడబ్ల్యూవో లక్ష్మీరాజం స్పష్టం చేశారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
బుధవారం 04.11.2026
www.kalamjyothi.com

పాకాలలోకి సురక్షితంగా మొసలి పిల్ల



కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 03) : చెన్నారావుపేట మండలం ధర్మతండ గ్రామపంచాయతీ పరిధిలోని అంగోతు చిన్న వ్యవసాయ క్షేత్రంలోని కుంట సమీపంలో మొసలి పిల్ల కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. రైతు చిన్న వెంటనే స్పందించి గ్రామ సర్పంచ్ బోడ రవి నాయక్‌కు సమాచారం అందించారు. సర్పంచ్ ఇచ్చిన సమాచారంతో అటవీ శాఖ బీట్ ఆఫీసర్ నవీన్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మొసలి పిల్లను సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం దానిని పాకాల సరస్సులోకి తరలించి నీటిలో విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజు, భూక్య, మద్రాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

వాట్సాప్ సేవలపై వినియోగదారుల ప్రశంసలు
అధికారులు, వినియోగదారుల మధ్య సమన్వయం
మింట్ కాంపౌండ్‌లో విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహణ




కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 03) : తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (TGSPDCL) మెట్రో జోన్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవ సమావేశం చీఫ్ ఇంజనీర్ కరుణాకర్ బాబు అధ్యక్షతన సైఫాబాద్‌లోని మింట్ కాంపౌండ్ కార్యాలయంలో మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశంలో సాఫ్ట్‌వేర్, పారిశ్రామిక, వాణిజ్య, వ్యాపార సంస్థలు, నివాస కాలనీలు, గృహ వినియోగదారులు, భవన నిర్మాణ యజమానుల ప్రతినిధులు 26 మంది పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. మురికివాడలు, 200 చదరపు గజాల లోపు ఇళ్లకు జీహెచ్ఎంసీ నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (OC) లభించడం లేదని, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. అలాగే రిజిస్టర్డ్ దస్తావేజులు లేని చోట నిబంధనల ప్రకారం నోటరీ పత్రాల ఆధారంగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని, పాత భవనాలకు అదనపు డెవలప్‌మెంట్ ఛార్జీల వసూళ్లను నివారించాలని, దీనిపై ఇప్పటికే ఈమెయిల్‌లో పంపిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

వాట్సాప్ సేవలపై ప్రశంసలు..

గత రెండేళ్లుగా సంస్థ అమలు చేస్తున్న 11 కేవీ ఫీడర్ వారీ వినియోగదారుల వాట్సాప్ గ్రూపుల సేవలపై పలువురు వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా ప్రశంసించారు. విద్యుత్ అంతరాయాల ముందస్తు సమాచారం, ఫీడర్ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తేవడం, ఫిర్యాదులపై సిబ్బంది వేగంగా స్పందించడం, పునరుద్ధరణ వివరాలు పంచుకోవడంలో ఈ గ్రూపులు ఎంతో ఉపయోగపడుతున్నాయని కొనియాడారు. వినియోగదారుల నుంచి వచ్చిన ఈ మద్దతు సంస్థ అధికారులు, ఎఫ్‌హోసీ, ఆపరేషన్ సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపిందని అధికారులు పేర్కొన్నారు.

అధికారులు మధ్య సమన్వయం..

విద్యుత్ సరఫరా నాణ్యతను పెంచడం, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఇలాంటి సమావేశాలు దోహదపడతాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అంబుడ్స్‌మన్ చైర్మన్ శ్రీనివాచారి, వినియోగదారుల ప్రతినిధులు సురేష్, సాయిబాబా, వినియోగదారుల ఫోరం సభ్యులు శోభారాణి, లలిత పాల్గొన్నారు. వీరితో పాటు సూపరింటెండింగ్ ఇంజనీర్లు సుచేందర్ నాథ్, వేణుగోపాల్, రమేష్, శ్రీనివాస్, మెట్రో జోన్ పరిధిలోని డివిజనల్ ఇంజనీర్లు హాజరయ్యారు.



క్ర.సం	సెక్షన్	11kV ఫీడర్ల మొత్తం సంఖ్య	11kV ఫీడర్ వాట్సాప్ గ్రూపుల్లో వినియోగదారుల సంఖ్య (01-10-2026)	11kV ఫీడర్ వాట్సాప్ గ్రూపుల్లో వినియోగదారుల సంఖ్య (01-11-2026)	ప్రగతి (పెరుగుదల) (5)-(4)	ప్రతి ఫీడర్‌కు సగటు గ్రూప్ వినియోగదారుల సంఖ్య (5)/(3)
1	ఎస్.కే. నగర్	12	2,433	2,595	+162	216
2	అమీర్‌పేట్	12	1,737	1,713	-24	143
3	బంజారాహిల్స్	44	5,029	5,068	+39	115
4	యుసుఫ్‌గూడ	24	2,320	2,353	+33	98
5	ఫిల్మ్ నగర్	33	3,043	3,041	-2	92
6	మాధాపూర్	41	3,578	3,707	+129	90
7	జూబిలీ హిల్స్	35	2,991	3,058	+67	87
డివిజన్ మొత్తం		204	21,135	21,540	+404	106

ప్రధాన విశ్లేషణ (Analysis)

మొత్తం వినియోగదారులు (01-11-2026)	21,540
మొత్తపు పెరుగుదల (01-10-2026 నుంచి)	+404
ప్రతి ఫీడర్‌కు సగటు సభ్యుల సంఖ్య	106
లక్ష్యం (Target)	ప్రతి ఫీడర్‌కు ≥ 100 మంది
లక్ష్యాన్ని చేరిన సెక్షన్లు (సగటు ≥ 100)	ఎస్.కే. నగర్, అమీర్‌పేట్, బంజారాహిల్స్
మరింత మెరుగుదల అవసరమైన సెక్షన్లు	యుసుఫ్‌గూడ (98), ఫిల్మ్ నగర్ (92),





లారీపైనుంచి జారిన
భారీ జేసీబీ

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి బస్టాండ్ సమీపంలో లారీలో తరలిస్తున్న భారీ చైన్ జేసీబీ ఒక్కసారిగా కదులుతున్న వాహనంపైనుంచి జారి రోడ్డుపై పడిపోయింది. ఆ సమయంలో సమీపంలో ఇతర వాహనాలు, పాదచారులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తృటిలో తప్పి స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో భారీ యంత్రాలను తరలించేటప్పుడు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, అధికారులు పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

- కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట

పార్టీలకు
తిరిగే రకం కాదు..
సోషల్ మీడియాలో కనిపించే తన
గ్లామరస్ ఇమేజ్‌కు, నిజ జీవిత
స్వభావానికి ఏమాత్రం సంబంధం
లేదని బాలీవుడ్ నటి దిశా పటానీ
స్పష్టం చేశారు. కల్కి వంటి చిత్రాలతో
తెలుగు ప్రేక్షకులకూ సుపరిచితమైన
ఆమె, నిత్యం గ్లామర్ ఫొటోషూట్లతో
సందడి చేస్తూ పబ్‌లు, పార్టీలతో
బిజీగా ఉంటారనే ప్రచారంపై
స్పందించారు. తాను పార్టీలకు తిరిగే
రకం కాదని, వ్యక్తిగత జీవితంలో
చాలా రిజర్వ్‌డ్‌గా ఉంటానని
తేల్చిచెప్పారు. ఎవరితోనూ త్వరగా
కలవలేనని, నైట్ లైఫ్, పబ్ సంస్కృతికి
తాను ఎంతో దూరమని తెలిపారు.
వెండితెరపై కనిపించే గ్లామర్ పాత్రలు
కేవలం నటనలో భాగం మాత్రమేనని,
వాటిని నిజ జీవితంతో పోల్చవద్దని
కోరారు. షూటింగ్‌లు లేని సమయాల్లో
ఇంట్లోనే ఉంటూ పుస్తకాలు చదవడం,
జిమ్‌లో వర్కవుట్లు చేయడం, పెట్స్‌తో
సమయం గడపడమే తనకు ఇష్టమని
ఆమె పేర్కొన్నారు.

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.